క్లుప్తంగా

చేబ్రోలుకు మంచినీటి ట్యాంకర్ వితరణ



మంచినీటి వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరి

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామస్తుల తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు తపన ఫౌండేషన్ ద్వారా కొత్త మంచినీటి ట్యాంకర్‌ను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అందజేశారు. సోమవారం ఆయన మంచినీటి ట్యాంకర్‌ను సీతారామాంజనేయ చౌదరి సమక్షంలో చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మి సునీత రాజారావు చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత రాజారావు మాట్లాడుతూ అడిగిన వెంటనే స్పందించి తమ గ్రామానికి మంచినీటి ట్యాంకర్‌ను అందించిన గారపాటి చౌదరికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ పడాల దుర్గాభవాని, తాతాజీ, బొమ్మిడి అప్పారావు, పిట్ట శివయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పళ్ళెం ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్‌ను సోమవారం విజయవాడలో లిబర్టీ ఆసుపత్రిలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయన వెంట చల్లగోళ్ళ తేజ, తదితరులున్నారు.

కొత్తపల్లి గ్రామస్తులకు తాగునీటి సరఫరా



కొత్తపల్లిలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందిస్తున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ శివారు కొత్తపల్లి ప్రజల తాగునీటికోసం పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్ వెంటనే చర్యలు చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి గ్రామస్తులకు సరఫరా చేశారు. కొత్తపల్లి గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్య తక్షణ పరిష్కారానికే 'స్పందన'



పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో స్పందన ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

పెదవేగి : సమస్య తక్షణ పరిష్కారానికి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు చెప్పారు. పెదవేగి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన రెండు ఫిర్యాదులను తీసుకుని పరిశీలించిన అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు, ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ , మండల వ్యవసాయాధికారి పి ప్రియాంక, ఎస్ ఐ లక్ష్మణ్, ఎంఈఓ బుధ వ్యాస్, వెలుగు ఏపీఎం శరత్ పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంత్యుత్సవం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయం

పెదపాడు: మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి జయంతోత్సవాలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అప్పనవీడులోని నాలుగు రోడ్ల సెంటర్‌లో నాలుగు ప్రధాన రహదారులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయాన్ని సుందరంగా విద్యుద్దీపాలతో అలకంరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం



చేబ్రోలులో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 151రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ నవరత్నాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని అన్నారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కంగారు పడాల్సిన అవసరం లేదని వాసుబాబు స్పష్టం చేశారు. ఆర్థికంగా ఎన్నికష్టాలు ఎదురైనా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికే పనిచేస్తుందని అన్నారు. గతంలో దళారీలు రైతులను దోచుకు తినేవారని ఆ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తున్న విషయం రైతులు గ్రహించాలని కోరారు. అకాల వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకులు చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మవద్దని వాసుబాబు అన్నారు. గడపగడపకు తిరిగిన సందర్భంలో ప్రజలు చెప్పిన సమస్యలను వాసుబాబు ఆలకించి వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. వాసుబాబు వెంట వైసీపీ మండల కన్వీనర్ మరడా మంగారావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొత్రిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడా రమావతి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, చేబ్రోలు మాజీ సర్పంచ్, నాయకుడు కరణం బుజ్జి, వైసీపీ యువత నాయకుడు ఆకుల రాజా, పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు అధికారులు అండగా నిలవాలి



హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సదుపాయాల విషయంలో ఏ విధమైన సమస్య తలెత్తినా తక్షణం పరిష్కరించాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం హౌసింగ్ అధికారులతో దెందులూరు నియోజకవర్గంలో హౌసింగ్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్ల గురించి, జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో దెందులూరు నియోజకవర్గ హౌసింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొక్కిరపాడులో 'గడపగడపకు'

పెదపాడు : మండలంలోని కొక్కిరపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలును వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండలంలోని వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు నిడమర్రులో..

నిడమర్రు: నిడమర్రు గ్రామ సచివాలయం పరిధిలో వెంకటాపురం ఏరియాలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై ఇప్పటి వరకూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, వైసీపీ శ్రేణులు హాజరవ్వాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరవండి

పెదవేగి : అకాల వర్షాలకు మొక్కజొన్నలు తడిసి మొలకలు వచ్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం పెదవేగి మండలంలోని అమ్మపాలెం, దుగ్గిరాల, భోగాపురంలో ఏపీ రైతు సంఘం నాయకులు పర్యటించి కల్లాల్లోని మొలకలు వచ్చిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,962 అమలయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న రైతులు పరసా దుర్గారావు,ఎం. ఏడుకొండలు,జె.రామారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పథకాల పంట



గుడివాకలంకలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

- గుడివాకలంకలో ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా జీవిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఆయన ఏలూరు మండలం గుడివాకలంకలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొఠారు మాట్లాడుతూ పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను మరిపిస్తోందని వివరించారు. లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు పథకాలతో ఆర్థిక భరోసా, ఆరోగ్య భద్రత కల్పించారని కొనియాడారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ప్రతి ఊరులో జగనన్నకాలనీ ఏర్పాటు చేశామన్నారు. రూ.కోట్లు ఖర్చుచేసి ఇళ్ల స్థలాలు మెరక చేస్తున్నట్టు తెలిపారు. కొల్లేరు గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కొత్త పైప్‌లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామని వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కొల్లేరు రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. మొదట ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి పథకాల అమలుపై ఆరా తీశారు. గ్రామస్తులకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ జయమంగళ ప్రభావతి, రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, నాయకులు భాస్కరరావు (బాపనయ్య) ముంగర సంజీవ్‌కుమార్, తహసీల్దార్ బి.సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి, ఇంజినీరింగ్ అధికారులు కృష్ణమోహన్, శ్రీకాంత్, ఎంఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కిషోర్, పంచాయతీ వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు.. గ్రంథాలయాలు



పూళ్లలో వేసవి శిక్షణలో భాగంగా పలు సూచనలందిస్తున్న హెచ్ఎం షేక్ మస్తాన్, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు



భీమడోలులో వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, వైఎస్సార్ సీపీ నేతలు

భీమడోలు: విజ్ఞానభాండాగాలైన గ్రంథాలయాలను విద్యార్థి దశ నుంచి వినియోగించుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. వాల్‌పోస్టర్లు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల మానవత సేవా సంస్థ మండల చైర్మన్ గుల్ల నూకరాజు పాల్గొని ప్రసంగించారు. మండల మానవత సేవా సంస్థ చైర్మన్ గుల్ల నూకరాజు విద్యార్థులకు అవసరమైన ఆట వస్తువులను కొనుగోలు చేసేందుకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి సత్యేంద్ర చిన్నారులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించారు. సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి పలు అంశాల్లో విజేతలకు బహుమతులు అందిస్తామని హామీ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్ సత్యేంద్ర స్పోకెన్ ఇంగ్లీషు, వివిధ అంశాలపై మెలకువలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మద్దాల అప్పారావు, రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్, టీచర్ వై.రమణ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

పూళ్లలో..

పూళ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం శిక్షణ తరగతులను సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హెచ్ఎం మస్తాన్ చిన్నారులకు పలు అంశాలపై సూచనలందించారు. మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, సభ్యులు దాసం మంగయ్య, పీవీ కృష్ణారావు, వి.ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండుగొలనులో..

గుండుగొలనులో శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం వాల్‌పోస్టర్లు, కరపత్రాలను గ్రంథాలయ అభివృద్ధి అధ్యక్షుడు నల్ల శంకర్, రిటైర్డ్ టీచర్ బాలిన సింహాచలం, శనపతి శ్రీనివాసరావు, సతీష్ ఆవిష్కరించారు. గ్రంథపాలకురాలు జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు గ్రంథాలయంలో..

దెందులూరు: గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పోతునూరు గ్రంథాలయ అధికారి డీ.జాన్‌బాబు అన్నారు. సోమవారం రీసోర్స్‌పర్సన్ కీర్తిరాహుల్ విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. ఈ నెల 11 వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్టు జాన్‌బాబు వివరించారు.

వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి

నిడమర్రు: నిడమర్రు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ పాలకులు జి, బాల్‌రాజు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కోరారు. సోమవారం ఆ గ్రంథాలయంలో వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు గ్రంథాలయం అందుబాటులో ఉంచేందుకు వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) ప్రారంభించారు. ఈ శిబిరంలో సోషల్ టీచర్ శానం శ్రీనివాసరావు, 30 మంది వరకూ విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

పెదవేగి : విద్యార్థులు వేసవి సెలవులలో పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పెదవేగి గ్రామ సర్పంచ్ తాత శ్రీరామమూర్తి అన్నారు. సోమవారం పెదవేగి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమని, విద్యార్థులు ఈ వేసవి సెలవుల్లో పుస్తక పఠనము, లేఖనం, పేపర్ ఆర్ట్ తదితర వాటిలో శిక్షణ పొందాలని ఆయన అన్నారు. గ్రంథ పాలకులు తోట అరుణ్ కుమార్, కంచన మోహన్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.



పెదవేగిలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరామమూర్తి



గుండుగొలనులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు, రిటైర్డ్ హెచ్ఎంలు

ధాన్యం రక్షణకు జాగ్రత్తలు పాటించాలి

దెందులూరు: రబీలో వరి ప్రధానమైన పంట. చాలా ప్రాంతాల్లో కోతలు పూర్తికాగా, ఆలస్యంగా సాగు చేపట్టిన ప్రాంతాల్లో మసూళ్లు పూర్తవుతున్నాయని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. నాగేంద్రబాబు అన్నారు. ఆదివారం దెందులూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పనమీద కళ్లాల్లో ఉన్న వరి పంట దెబ్బతింటే రైతులకు తీవ్రమైన నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. వివిధ దశల్లో ఉన్న వరిచేలు తుఫాన్ ప్రభావానికి గురైతే శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సూచనలు విధిగా పాటించాలన్నారు. ప్రస్తుతం మనుషులతో కోత కోసిన పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారీ చేయాలని, వర్షాలు తగ్గి, ఎండరాగానే పనలు తిరగేసి, ఎండబెట్టి నూర్చుకోవాలి. పొలంలో నీరు లేకుంటే మడిలోనే పనలపై ఉప్పునీరు చల్లుకోవచ్చు. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్ల పైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవడం ద్వారా మొలకెత్తకుండా, రంగు మారకుండా చూసుకోవచ్చు. కుప్ప వేసే సమయంలో తుఫాన్ వాతావరణం వల్ల పనలు తడిస్తే కుప్పలు వేసేటట్లు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు. మార్చిన ధాన్యం 2–3 రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాకుండా రంగు మారి చెడువాసన వస్తుంది. ఇలాంటి సమయంలో నష్టాన్ని నివారించేందుకు ఒక క్వింటా ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగుపెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి. చివరిగా పూర్తిగా తడిచి రంగు మారిన ధాన్యానికి మార్కెట్ పూర్తిగా తగ్గిపోతుంది. అటువంటి ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంలా అమ్ముకోవడం ద్వారా కొంత నష్టాన్ని నివారించుకోవచ్చు.

జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో వివాదాలకు చెక్



ఆగడాలలంకలో మాట్లాడుతున్న ఎంపీపీ కనమాల రామయ్య, తహసీల్దార్ షంషూద్దీన్

భీమడోలు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా భూ వివాదాలకు చెక్ పడుతుందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. కొల్లేరు ప్రాంతానికి చెందిన ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామాల్లోని ప్రజలకు జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఆగడాలలంక సర్పంచ్ భలే రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ కనమాల రామయ్య, తహసీల్దార్ షంషూద్దీన్ హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ శతాబ్దాలుగా భూ రికార్డులను ప్రక్షాళన చేయకపోవడంతో గ్రామాల్లో భూ సమస్యలు తలెత్తాయని, వాటిని పరిష్కరించి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ షంషూద్దీన్ మాట్లాడుతూ డ్రోన్ సర్వే పూర్తి కాగా క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు తమ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులను రెవెన్యూ సిబ్బందికి అందించాలని, తద్వారా సర్వే త్వరితగతిన సాగేందుకు దోహద పడుతుందన్నారు. సర్వే అనంతరం భూముల వద్ద సరిహద్దులను నిర్ణయించి రాళ్లను పాతుతామని, సమస్యలు ఎదురైతే మొబైల్ కోర్టుల ద్వారా వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి కమతానికి ప్రత్యేక నంబర్‌ను ఇస్తామని, తద్వారా తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్ పెడుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు జల్లారి అభిమాన్యు, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే మానవత లక్ష్యం



నిత్యవసరాలు, నూతన వస్త్రాలను అందిస్తున్న పచ్చా వెంకటేశ్వరరావు, పులిచర్ల వెంకట కృష్ణారావు

భీమడోలు: నిరుపేద కుటుంబాలను వారిని ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని భీమడోలు మండల మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు అన్నారు. పూళ్ల, నాగేశ్వరపురం గ్రామాలకు చెందిన ఐదు నిరుపేద కుటుంబాల వారికి సోమవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసరాలు, బియ్యం, వైసీపీ నేత సాయిరామ్ క్లాత్ షోరూమ్ పున్నం గోపి ఆర్థిక సాయంతో నూతన వస్త్రాలను అందించారు. ఆయా గ్రామాలకు చెందిన గాలి దేవి, యర్లపాటి పేతురు, ఏలేటి జాన్, కూన నీలిమ, అల్లంపల్లి సత్యవేణి కుటుంబాలను వారు పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు, నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, ఈసీ సభ్యుడు డోకల పెద చిన్నారావు, యాసా చిట్టియ్య, దాసం మంగయ్య, ఇస్రాయేలు, చింతల ప్రసాద్, కుమారి, ఏ.గొయ్యమ్మ పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా మిల్లులకు తరలించండి

పెదపాడు : మండలంలో రబీసాగులో వరిపంట సాగుచేసిన రైతులంతా ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్లులకు తరలించాలని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు తెలిపారు. జిల్లా కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వాతావరణ కేంద్రం సూచనలు ప్రకారం రానున్న 4 రోజుల్లో మోబా తుఫాను ఏర్పడి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున పెదపాడు మండలంలో రబీ పంట సాగు చేస్తున్న రైతులందరూ మీ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి: ఓవ్యక్తి ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన భోగాపురంలో చోటు చేసుకుంది. పెదవేగి ఎస్సైఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామర్తి రవికుమార్ కొంతకాలంగా ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవు తూ ఈనెల 7న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని రాజ్‌కుమార్ సోదరుడు మురళీనాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మొక్కజొన్న పంటకు మద్దతు ధర

పెదవేగి : మొక్కజొన్న రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్ళగొళ్ల భూస్వామి అన్నారు. పెదవేగి మండలం కొప్పాక సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భూస్వామి మాట్లాడుతూ అన్ని రకాలుగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేస్తూ, క్వింటా రూ.1,962 ప్రభుత్వ మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం గుప్తా, ఏఓ ప్రియాంక, సొసైటీ కార్యదర్శి రమేష్, వీఏఏలు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు

పెదపాడు : ఓ యువకుడు అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని జానంపేటకు చెందిన బబ్బూరి ప్రభుకుమార్ విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదివాడు. సెలవులు కావడంతో గుడివాడ సమీపంలోని తమలంపాడులో ఉంటున్న అమ్మమ్మ గంగారత్నం ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి ఆదివారం ఉదయం ఏపూరులోని చర్చికి అమ్మమ్మతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మనవడు ప్రభు కనపడకపోవడంతో చుట్టుప్రక్కలా వెతికారు. ఆచూకి లేకపోవడంతో గంగారత్నం ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.